# ఆదర్శం

శనివారం సాయంత్రం రాధిక దగ్గరుండి పనిమనిషిచేత ఇల్లు తుడిపిస్తోంది.

పనిమనిషి జయ ఇల్లు తుడుస్తూ మాట్లాడుతోంది.

రాధిక సెక్రటేరియట్‌లో సెక్షన్ ఆఫీసరు.

మామూలు రోజుల్లో నిలబడి పనిచేయించుకుందుకు ఆమెకు కుదరదు.

ప్రొద్దుటే హడావుడిగా వంట. పెద్దమ్మాయిని స్కూలుకి పంపించి చిన్న పిల్లను క్రెష్‌లో దింపి ఆఫీసుకు వెళ్ళాలి. అందుకే శెలవు ఉన్నపుడు దగ్గర నిలబడి పనిచేయించడం జరుగుతూ ఉంటుంది. ఆ టైంలోనే తన కష్టం, సుఖం చెప్పుకుంటూ ఉంటుంది జయ. తనకు మంచి అనిపించినవీ జయ ఆచరిస్తుందన్న నమ్మకం ఉన్నవీ సలహాలిస్తుంది రాధిక.

బెడ్రూం తుడుస్తూ అడిగింది. "అమ్మా ఈ బీరువా ఎంత అవుతుంది? రెండువేలకు వస్తుందా?"

"నేను కొన్నప్పుడు రెండువేలు. ఇప్పుడు మూడు వేలపైనే ఉంటుందేమో. ఏం ఎందుకు?"

"ఈ నెలలో చీటి అయిపోతుందమ్మా నెలకి రెండువందలు. పదినెలలు అయింది. పదో తారీకుకి రెండు వేలొస్తుంది. నేనెప్పుడూ చీటీపాడను. ఆ డబ్బుతో ఏమైనా కొనుక్కుంటా"

జయ కట్టేచీటీలు రాధికకు తెలుసు. నాలుగిళ్ళలో పని చేస్తోంది. నలుగురూ నాలుగు వందలిస్తారు. మిగతా ముగ్గురు ఒకళ్లు బ్యాంకులో, ఒకళ్లు పబ్లిక్ స్కూలులో, ఒకావిడ కంపెనీలో పనిచేస్తున్నారు. జయ చాలా కష్టజీవి. తెలివైనది కూడా. నాలుగిళ్ళల్లో వాళ్ల ఆఫీసు టైంలకి సరిపోయేలా తన టైం పెట్టుకొని ఎవరికీ కోపాలు రాకుండా పనిచేస్తోంది. చంటిపాపను తల్లి దగ్గరుంచి, పొద్దుటే ఆరు గంటలకి వస్తుంది. పదిన్నర దాటాక ఇంటికి వెడుతుంది. మధ్యాహ్నం మూడుగంటలనుంచి ఆరుదాకా పనిచేస్తుంది. ఎవ్వరికీ ఏ రోజూ మాన్పించాలని అన్పించదు.

"ఏమ్మా మాట్లాడటం లేదు"

రాధిక ఉలిక్కి పడింది.

"బీరువా మీదికి పోయిందేం మనస్సు"

"ఏముందమ్మా నలుగురూ నాలుగు కొత్త చీరలిస్తారు. నాలుగు పాతచీరలిస్తారు. పిల్లలవి పొట్టయిన బట్టలిస్తారు. ఇంట్లో ఎలకలున్నాయమ్మ. బీరువా ఉంటే దాచుకొంటాను. మూడు వేలంటున్నారుగా ఇంకా వెయ్యి కావాలి. టైం ఎంతైందమ్మా" శనివారం టి.వి. సినిమా మిస్సవ్వదు జయ.

"ఇంకా సినిమా టైం కాలేదులే. పోనీ టి.వి. కొనుక్కో, చిన్న టి.వి.లు నీ డబ్బుకు వస్తాయి". జయ ఒక క్షణం తట పటాయించి "వద్దులేమ్మా" అంది.

రాధిక ఇదివరలో జయకు బ్యాంకులో పొదుపు గురించి చెప్పడానికి ప్రయత్నించి విఫలురాలైంది. తాము నలుగురూ ఉద్యోగినులు కనుక ఈరోజు జీతాలు బాగానే ఇస్తున్నారు. తిండి, బట్ట కూడా బాగానే ఇస్తున్నారు. కానీ రేపు జయకి ఓపిక తగ్గితే పనిమనిషిని మార్చేస్తారు కదా. అందుకే చీటి కాకుండా రికరింగ్ డిపాజిట్ వేసుకోమని జయకు చెప్పింది. వృద్ధాప్యంలో పనికి వస్తుందని చెప్పింది. జయకు నచ్చలేదు. మా బస్తీలో అంతా అన్నీ కొనుక్కుంటారమ్మ అంది. రాధిక అందుకే ఇప్పుడా డబ్బు ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో వేసుకోమనలేదు.

"పోనీలే బంగారం కొనుక్కో చెవిదుద్దులు వస్తాయి"

"అమ్మా నా కష్టం ఎవరికి చెప్పుకోను. మా ఆయన తాగుబోతు. తను సంపాదించింది పైసా ఇంట్లో ఇవ్వడు. నేను మీ ఇళ్లల్లో నుంచి పట్టుకెళ్లిన అన్నం తింటాడు. తను సంపాదించింది తాగేస్తాడు. నా పెండ్లికి మా అమ్మ నాకు చెవికి కమ్మలు పెట్టింది. కాళ్లకు వెండిపట్టీలుండేవి. అన్నీ అమ్ముకున్నాడు. ఆఖరికి మా పాప కాళ్లకి కడియాలు ఉండేవి అవి కూడా అమ్ముకున్నాడు. మా పాప పుట్టినపుడు ఎండలున్నాయని ఫాను తీసుకొన్నాను. అది కూడా పై ఫానేనమ్మా. టేబిలు ఫానయితే తక్కువే. అయినా పట్టుకుపోయి అమ్ముకుంటాడని భయం. మీరిందాకా టి.వి. అన్నారు కదా. చిన్న టి.వి. అయితే పట్టుకుపోతాడు బీరువా అయితే పట్టుకుపోలేడు కదా"

రాధిక తెల్లబోయింది. జయ ఎప్పుడోకాని ఇంటి సంగతులు చెప్పదు. చదువు రాకపోవడంవల్ల ఆడవాళ్లకి ఎన్ని కష్టాలు, తన జీవితం ఎంత బాగుంది. ఆడవాళ్లకి తమ హక్కులు పూర్తిగా తెలియాలి. తను పెళ్లికి ముందే తన కాబోయే భర్తని ఇంటర్వ్యూ చేసింది. తన అభిప్రాయాలన్నీ పూర్తిగా చెప్పింది. ఇద్దరూ సమంగా ఉద్యోగాలు చేస్తున్నారు. ఇంటి ఖర్చు, ఇంట్లోపని అన్నీ సమంగా పంచుకోవాలి. అంతేకానీ బాధ్యతలన్నీ ఆడవాళ్లకీ, క్లబ్బులో తాగుడూ, పేకాట మగవాళ్లకీ కాకూడదు. తను చెప్పినవన్నీ ఒప్పుకున్నాకనే పెళ్లిచేసుకుంది. పాపం జయ, చదువురాదు. అందుకే మగాడి దురాగతాలన్నీ చెల్లుతున్నాయి.

❖ ❖ ❖

మళ్లీ శనివారం రాధిక చేతిలో రెండువేల రూపాయలు పెట్టింది జయ.

"మీ దగ్గరుంచండమ్మా, చీటిపాట ఈరోజేనని మా ఆయనకు తెలుసు. రాత్రివచ్చి పైసలు అడుగుతాడు. ఇంట్లో ఉంటే పట్టుకుపోతాడు. మీ దగ్గరైతే తీసుకోలేడు కదా. నా కష్టం వాడితాగుడుకెందుకివ్వాలి?"

"మరి ఊరు కుంటాడా?"

"ఏముందమ్మా తిడతాడు, కొడతాడు పైసలట్టుకుపోలేడు కదా"

"అంతగా కొడితే, తిడితే ఎందుకు ఊరుకుంటావు. అలాంటి వెధవతో కాపురం చేసేదేమిటీ? ఒక్కరోజు పేకాడితే నేనైతే ఊరుకోను తెలుసా. మా ఆయన దగ్గర నేనే వందరూపాయలు ఫైను వసూలు చేస్తాను. నువ్వు నీడబ్బులట్టుకుపోయి తాగితే ఎందుకు పడిఉంటావు. వాడిని వదిలెయ్యి"

రాధిక ఈ మాటలు అనకుండానే జయచెప్పింది.

"మా వోళ్లంతా వాడిని వదిలేయమంటారు. బస్తీలో వాళ్లు అదే అంటారు. వదిలేస్తే ఏముందమ్మా మంచో చెడో పెండ్లి చేసుకున్నాను. ఇంక వాడితోటే బతకాలి. మొగోడంటూ ఉన్నాడు కాబట్టే మా బస్తీలో ఎవరూ నాకేసి చూడటం లేదు. లేకపోతే ఏముందమ్మా అందరు మొగాళ్లు నమిలి మింగేస్తారు"

కేవలం ఈ మానరక్షణకోసమా మగవాడి కాళ్లదగ్గర అంతగా పడుతోంది. రాధికకెందుకో అనిజం చాలా చేదుగా అనిపించింది. తనలా చదువుకొని ఉద్యోగం చేస్తుంటే ఏ వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌లోనో ఉండవచ్చు. అప్పుడీ అవసరం ఉండేది కాదు. మాట మారుస్తూ అంది రాధిక.

"ఎవరైనా స్టీలు సామాన్లవాడొస్తే పిలు" జయ అయిష్టంగా మొహంపెట్టింది.

"నా పాతచీరలు, పిల్లలబట్టలు నీకే ఇస్తున్నానుగా. ఏవో పాత నూలు చీరలు, లుంగీలు, నావి నైటీలు ఉన్నాయి. అవినీకెలాగూ పనికిరావు. ఇంట్లో చోటు కలిసివస్తుంది. ఈసారి కనపడితే పిలు". జయ మాట్లాడలేదు.

❖ ❖ ❖

నాలుగురోజులు పోయాక జయని ఇంకా డబ్బు తీసుకెళ్లలేదేమని అడిగింది రాధిక. జయ సిగ్గుపడింది.

"నాకు నెలతప్పిందమ్మా కానుపు టైంకి పనికి రాలేను కదా. ఇపుడైతే మీరందరూ ఇచ్చిన అన్నంతో తింటున్నాము. అప్పుడు అన్నీ కొనుక్కుని తినాలి. మీ దగ్గర్నే ఉంచండి. పైసలపుడు పనికి వస్తాయి."

ఏం కంటారీ చదువురాని లేబర్‌క్లాస్ ఆడవాళ్లు? తన అమ్మాయిలిద్దరికీ నాలుగేళ్లు తేడా. వీళ్లకి ఫ్యామిలీ ప్లానింగ్ ఏం తెలియదు. రాధిక ఆలోచిస్తుంది. జయ రాధిక మౌనాన్ని ఇంకోలా అర్థం చేసుకుంది.

"పర్వాలేదమ్మా ఆ రెండు నెలలకి ఎవర్నైనా పెడతాను మెల్లగా. చేయించుకోండి. ఆ తరువాత నుంచి నేనే చేస్తా".

తమలా వీళ్లకి మెటర్నిటీలీవు ఉండదు.

"నేను నా సంగతి ఆలోచించడం లేదు. మీ పెద్దపాపకింకా రెండేళ్లు నిండలేదు. కదా. అపుడే మళ్లీనా అని ఆలోచిస్తున్నా"

"ఏం చెయ్యనమ్మా. ఓపికుండగానే కనాలి. రేపు కానుపయ్యేదాకా వచ్చి చెయ్యాలి పని. మళ్లీ రెండు నెలలకే పని చేసుకోవాలి. లేకపోతే ఇల్లు గడవదమ్మా. ఈసారి కానుపవగానే ఆపరేషన్ చేయించుకుంటా. చిన్నప్పుడైతే మంచిది కదా. టి.వి.లో చూస్తున్నా."

రాధిక ఎంతో సంతోషించింది. ప్రభుత్వ ప్రచారం ఈ మాత్రం పనిచేస్తోందని.

"నువ్వు సినిమాలే చూస్తావనుకున్నాను"

"లేదమ్మా అన్నీ చూస్తాను. అమ్మా పాత బట్టలు సామానుకివ్వకండమ్మా. మొన్ననే చెప్దామనుకున్నాను. సిగ్గేసింది. నాకివ్వండమ్మా. కానుపుకు పనికొస్తాయి"

"అలాగే తీసుకుందువుగాని"

తరువాత శనివారం ఇల్లు తుడుస్తూ అంది జయ.

"నిన్న నాకూ ఆయనకూ పెద్ద కొట్లాటైందమ్మా"

ఏముంది తాగడానికి డబ్బు అడిగి ఉంటాడని అనుకుంది రాధిక.

"నేను ఆపరేషన్ చేయించుకుంటానన్నాను కదా. మగపిల్లోడైతే చేయించుకో నాకు కొడుకు కావాల అంటాడు. ఎవరైతే నేమిటి నేను ఆపరేషన్ చేయించుకుంటానని నేను అన్నాను. పెద్ద గొడవయిపోయింది.

ప్రతిచోటా ఉండేగోడవే అనుకుంది రాధిక.

"కూతురికున్న ప్రేమ కొడుక్కుండదమ్మా. ఇరవయ్యేండ్లు మనం అన్నం పెడతాం. ఒక్కరోజు పెడతది కోడలు. ఆ ఒక్కరోజుకే దానిమనిపైపోతాడు. ఇరవయ్యేండ్లు పెట్టిన మనంయాదే ఉండం మా అన్న గాజు ఫిటింగులు కిటికీలకు చేస్తాడు. ఆ అమ్మ, నాన్న ఇంటిదిక్కైనా చూడడు. ఎందుకు వచ్చినమగ బిడ్డలు. నాకు కొడుకైనా, కూతురైనా ఒక్కటే.

జయ మాటలు నిజమే అనుకుంది రాధిక. తన అత్తగారు, మామగారు పల్లెటూళ్లో ఉన్నారు. ఐదుగురు కొడుకుల్లో ఎవరు చూస్తున్నారు. కోడలిమాటకు ఎదురు చెప్పకుండా ఉందికనుక తన తల్లిని అన్నయ్య ఇంట్లో ఉండనిస్తున్నాడు. కొడుకు వంశోద్ధారకుడు అనుకోవడం దండగ అనుకుంది.

"మా ఆయనతో గట్టిగా చెప్పినా, ఈ సారి నేనే పోయి ఆపరేషన్ చేయించుకుంటా. మొగోడి సంతకం కూడా అక్కర్లేదుటగా"

ఫర్వాలేదు, చదువురాకపోయినా టి.వి. ధర్మమా అని దీనికి విషయాలు బాగానే తెలుస్తున్నాయి అనుకుంది రాధిక.

❖ ❖ ❖

"మళ్లీ పోట్లాటయిందమ్మా మా ఇంట్లో" అంది జయ ఇల్లు తుడుస్తూ "ఆడపిల్లతే ఆపరేషన్ వద్దంటాడు మా ఆయన. ఆపరేషన్ చేయించుకుంటే ఒగ్గేస్తానన్నాడు. ఒగ్గేస్తే ఒగ్గేయి అన్నాన్నేను. నా కష్టం నేను చేసుకుంటున్నా. మీ ఇండ్ల మీ ఇండ్లఅన్నం తీసికెళ్లి వాడికి పెడుతున్నాను. వాడు నాకు చేస్తుందేముంది. నేను ఇంక పిల్లల్ని కనలేనమ్మా. ఇంట్లోపని, మీ ఇండ్లలోపని నాకష్టం వాడికేం తెలుస్తుంది. మగాడికేం తెలుసునమ్మా ఆ ఒక్క పనితప్ప" అంత పచ్చిగా మాట్లాడుతుంటే రాధిక చాలా సిగ్గుపడింది. ఎంత కష్టం ఉంటే తప్ప అలా సిగ్గువిడిచి మాట్లాడుతుంది. తమ చదువుకున్న వాళ్లలో మగాళ్లు బాధ్యత పంచుకుంటారు. వీళ్లకేముంది?

"మళ్లీ ఓసారి చెప్పి చూడు. మీ ఆయనకి కొడుకు కూతురు ఒక్కటేనని"

"ఇంక చెప్పేదేం లేదమ్మా. ఏమైనా నేను ఆపరేషన్ చేయించుకుంటా. కొడుకేమిటీ. కూతురేమిటీ, నువ్వేమయినా మీ అమ్మనీ, నాన్ననీ చూస్తున్నావా అని అడిగినా వాడు మాట్లాడలేదు. కోపం వచ్చి ఇంట్లోంచి పోయి తాగేసి వచ్చాడు ...

ఆరు నెలల తర్వాత కానుపయిందని జయ ఇంకో పనిపిల్లచేత కబురు పెట్టింది. మర్నాడు జయ తల్లి పాత బట్టలకోసం వచ్చింది. రాధిక బట్టలు ఇస్తూ అడిగింది.

"ఆడపిల్లా మగపిల్లాడా"

"ఆడపిల్లేనమ్మా, అచ్చం వాళ్లమ్మలా ఉంది" జయ ఆపరేషన్ ఏమైందో అనుకుంది రాధిక. మూడ్రోజుల తరువాత దాచుకున్నడబ్బుకోసం వచ్చింది జయతల్లి. డబ్బిస్తూ అడిగింది రాధిక.

"ఇంటికొచ్చిందా జయ?"

"లేదమ్మా ఆపరేషన్ అయిందిగా మూడ్రోజులక్కానీ ఇంటికి పంపించరట"

"నీ అల్లుడొప్పుకున్నాడా?"

"వాడు ఒప్పుకునేదేంటి? నాబిడ్డే చేయించుకుంది. నేను దగ్గరనే ఉన్నా ముందు వాడికి కోపం వచ్చింది. ఇప్పుడు పుట్టిన పాపను చూశాడు. కోపం అంతా పోయింది. జయకు మందులు కూడా వాడే తెచ్చాడు."

జయ తల్లి వెళ్లిపోయింది. రాధిక మెల్లగా లోపలకి వచ్చి కూచుంది. ఎదురుగా టేబిలు మీద లేడీ డాక్టరు రాసిచ్చిన మందు చీటి కనిపిస్తోంది. ఎంత ధైర్యం చేసింది జయ. ఏ మాత్రం చదువురాని జయ, తను భర్తతో సమంగా చదువుకొంది. భర్తతో సమంగా ఉద్యోగం చేస్తోంది. భర్తతో సమంగా జీతం తెస్తోంది. భర్తచేత ఇంటిపని సమంగా చేయిస్తోంది. కానీ ఇద్దరి ఆడపిల్లల తర్వాత జయచేసిన పని తనెందుకు చేయలేదు?"

పుట్టింటికి పంపిస్తూ "మగపిల్లాడైతే చేయించుకో ఆడపిల్లైతే ఆలోచిద్దాం" అన్నాడు భర్త. అల్లుడిని కాదని ఏం చెయ్యద్దమ్మా అంది అమ్మ. అమ్మాయి పుట్టినవెంటనే తనంత తను ధైర్యం చేయలేకపోయింది. నాలుగేళ్లనుంచి ఎవరైనా ఒకటేనని చెప్పడానికి ప్రయత్నించింది. చివరికి ఓడిపోయింది. అందుకే మూడోనెల, మందుల చీటీలు మళ్లీ మగపిల్లాడికై ఆరాటం.

జయ చేసిన పని తనెందుకు చేయలేదు? సమానత్వం మీద కాలేజీలో లెక్చర్లిచ్చిన తను కాపురంలో భర్తతో అన్నిటా సమానమన్న తను, చివరకు ఈ విషయంలో సమానత్వం దగ్గర వెనకంజయ్యింది. ఎక్కడుంది సమానత? చదువులోనా? ఉద్యోగంలోనా? ఇంటిపనిలోనా? ఏమో? పుట్టే పిల్లల విషయంలో మాత్రం కాదు.

మందుల చీటి ఫక్కున నవ్వినట్లనిపించింది రాధికకు.

(ఆంధ్రజ్యోతి డైరీ)